సాక్షి
కృష్ణాజిల్లా
శనివారం। 14। సెప్టెంబర్। 2024



నేడు లడ్డూ ప్రసాదాల విక్రయాలు

విజయవాడ కల్చరల్: పున్నమ్మ తోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం శ్రీ వారి లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తున్నట్లు టీడీడీ స్థానిక అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు.



గండ్లు పూడ్చినా లీకేజీ!

కొండపల్లి శాంతినగర్ సమీపంలో అధిక వర్షాలతో తెగిన బుడమేరు గుండ్లు పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. అయినప్పటికీ మట్టి కట్ట కింద నుంచి నీరు లీక్ అవుతోంది. -8లో▸



పవిత్రోత్సవాలు ప్రారంభం

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురారోహణతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

బ్యాంకు ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యం నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఈ నెల 27న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్ ఫెడరేషన్ విజయవాడ రీజనల్ సెక్రటరీ మణిగోపాల్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చాన్‌ఖాన్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సన్నాహక సమావేశాన్ని, ధర్నా కార్యక్రమాలను ఆ బ్యాంకు రీజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్యాంకులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం వల్ల ఉద్యోగులపై పని భారం ఎక్కువ అవుతోందన్నారు. ప్రతి రోజూ రాత్రి ఎనిమిది గంటలకు కూడా ఇంటికి వెళ్లలేక పోతున్నామని చెప్పారు. ఖాతాదారులకు సరైన సేవలు అందించలేకపోతున్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజయవాడ ప్రాంతీయ కార్యదర్శి ఎస్. సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కె. ఆనంద్ కిషోర్, సంయుక్త కార్యదర్శులు సందీప్, రవితేజ పాల్గొన్నారు.

నేడు ఎయిర్‌పోర్ట్ అప్రోచ్ రోడ్డు ప్రారంభం



విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో నూతనంగా అభివృద్ధి చేసిన అప్రోచ్ రహదారిని శనివారం ప్రారంభించనున్నట్లు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌కు అనుసంధానంగా ఈ అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ వద్ద నూతనంగా నిర్మించిన మినీ ఫ్లైఓవర్ వద్ద కొత్త అప్రోచ్ రోడ్డును ఉదయం 10 గంటలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం న్యూఢిల్లీ-విజయవాడ మధ్య ఇండిగో ఎయిర్‌లైన్స్ నడపనున్న నూతన విమాన సర్వీస్‌ను కేంద్ర మంత్రి ప్రారంభించనున్నట్లు చెప్పారు. విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు కేశినేని శివనాథ్ (చిన్ని), వల్లభనేని బాలశౌరి, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొంటారని తెలిపారు. అనంతరం నూతన టెర్మినల్ నిర్మాణ పనులపై కేంద్ర మంత్రి సమీక్షించనున్నట్లు ఏపీడీ వివరించారు.

రైల్వే పనులపై డీఆర్‌ఎంతో ఎంపీ సమీక్ష



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో పనుల పురోగతిపై ఎంపీ పురంధేశ్వరి డీఆర్‌ఎంను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి సమీక్షించారు. గతిశక్తితో పాటు పలు బ్రాంచ్‌ల అధికారుల బృందం రాజమండ్రిలో పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంపీకి వివరించారు. అభివృద్ధి పనులతో పాటు స్టేషన్ తూర్పు వైపున స్థలం కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం సహకరించాల్సిందిగా డీఆర్‌ఎం వివరించారు. రూ. 284.88 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్టేషన్ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు రైల్వే అధికారులతో కలసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. ఏడీఆర్‌ఎం ఎడ్విన్, గతిశక్తి సీపీఎం సీహెచ్‌పీఆర్ విఠల్, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీఈఎన్ ఎస్.వరుణ్‌బాబు, పలు బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

ముసురుకున్న వ్యాధులు

- జిల్లాలో విజృంభిస్తున్న విష జ్వరాలు
- వైరల్ ఫీవర్, మలేరియా, డెంగీ, కొత్త జ్వరం కేసులే అధికం
- మచిలీపట్నం ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి
- 800కి పైగా వస్తున్న రోజువారీ ఓపీ
- అడ్మిట్ అవుతున్న రోగులు కూడా ఎక్కువే
- ప్రైవేటు హాస్పిటల్స్‌లోనూ ఇదే పరిస్థితి

వరదల కారణంగా వ్యాపిస్తున్న రోగాలు



ప్రభుత్వ ఆస్పత్రిలోని మెడికల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

సాక్షి, మచిలీపట్నం: కృష్ణమ్మకు వచ్చిన వరదలు రైతుల పంటలను ముంచెత్తాయి. పేదల ఇళ్లను దెబ్బతీశాయి. రోడ్లను కోత పెట్టాయి. నిత్యావసరాలను పాడు చేశాయి. చెరువులకు గండ్లు పెట్టాయి. కూలీలు, వ్యాపారస్తులను ఇబ్బందులకు గురి చేశాయి. వారం రోజుల పాటు కంటికి నిదుర లేకుండా చేశాయి. ఇప్పుడు వరదలు పూర్తిగా తగ్గిపోయాయని జనం ఊపిరి పీల్చుకునే క్రమంలో వ్యాధులు పంజా విసురుతున్నాయి. వరద ప్రభావంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దోమలు, ఇతర కీటకాలు పెరగడంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లతో బాధ పడేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. అయితే, రక్త పరీక్షల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ నెగిటివ్ ఉన్నా.. కొత్త రకం జ్వరం ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఓపీతో పాటు అడ్మిషన్ తీసుకునే వారి సంఖ్య కూడా పెరిగింది.

రోజుకు 800 ఓపీ.. జ్వరాలు 500కి పైనే..

మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రి జ్వరాల బాధితులతో కిక్కిరిస్తోంది. ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూ ప్రతి రోజు 800కు పైగా ఓపీ నమోదవుతోంది. వీరిలో ఎక్కువ శాతం మంది జ్వరాలతో వస్తున్న వారే. రోజుకు 30 నుంచి 50 వరకు ఇన్ పేషంట్స్‌గా అడ్మిట్ అవుతున్నారు. దీంతో మెడికల్ వార్డుల్లో ఖాళీ లేక ఆరుబయటే వైద్యం అందిస్తున్నారు. గతంలో 600 వరకు ఉన్న ఓపీ ఇప్పుడు రోజుకు 200కు పైగా పెరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వైద్యం కోసం ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ప్రైవేటు వైద్యులు, ఆస్పత్రులకు వెళ్లి అడ్మిషన్ పొందే వారు కూడా ఎక్కువే ఉన్నారు. అయితే, ప్రైవేటు హాస్పిటల్స్‌లో రక్త పరీక్షలు, వైద్యం పేరుతో వేల రూపాయలు దోపిడీకి పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వివరాలు	
మొత్తం విభాగాలు:	26
మొత్తం బెడ్స్ సామర్థ్యం:	500
ప్రస్తుతం రోజుకు ఓపీ సుమారు:	800పైనే
ఇన్ పేషంట్లు:	550-600
రోజుకు వస్తున్న జ్వరాల కేసులు:	500 వరకు
ఇందులో డెంగీ పాజిటివ్:	10-12
అడ్మిట్ అవుతున్న వారి సంఖ్య:	30-40

కొత్త రకం జ్వరం..

వరదలతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడం.. మంచి నీరు కూడా కలుషితం కావడం ఇందుకు కారణాలుగా తెలుస్తోంది. వీటి నివారణకు వైద్య, ఆరోగ్య, సంబంధిత అధికారులు సరైన ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రజలు అంటున్నారు. వరద తర్వాత దోమలు విజృంభిస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులతో బాధపడే వారితో పాటు రక్త పరీక్షల్లో నార్మల్ ఉన్నా.. జ్వరం, దగ్గు, నీరసం, జలుబు వంటి లక్షణాలతో బాధపడే వారు అధికమైనట్లు అధికారులు చెబుతున్నారు.

జ్వరాలు అధికమయ్యాయి..



వివిధ రకాల జ్వరాలతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గత వారం రోజుల నుంచి పెరిగింది. రోజుకు 800 వరకు ఓపీ ఉంటుండగా ఇందులో అత్యధికంగా వైరల్ ఫీవర్‌తో బాధ పడేవారే. మెడికల్ ఓపీ కిటకిటలాడుతోంది. ముఖ్యంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి టెస్టులు నెగెటివ్ ఉన్నా.. జ్వరం, జలుబు, దగ్గు, నీరసం వంటి లక్షణాలతో వస్తున్నారు. ఇది కొత్త రకం జ్వరం కేసులు.

– డాక్టర్ ఎస్వీ సుందరాచారి, ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

పిల్లలపై ప్రభావం అధికమే..

వరద అనంతరం విష జ్వరాల బాధితుల్లో చిన్నారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుల్లో సుమారు 60 శాతం ఐదేళ్ల లోపు చిన్నారులే అని తెలుస్తోంది. ఉన్నట్టుండి ఒళ్లు వేడెక్కిపోవడం, నీరసం, చలి, గొంతు నొప్పి, జలుబు వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులూ ఆందోళన చెందుతున్నారు.

పేద విద్యార్థులకు నష్టం



మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. వాటిని సీఎం చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దారుణం. పేదలకు వైద్య విద్యను అందని ద్రాక్షగా మార్చేందుకు చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలి. ఎన్‌ఎంసీ అనుమతి ఇస్తే మాకు వద్దు, మేం అడ్మిషన్లు జరపలేం అంటున్న ప్రభుత్వం దేశంలో ఇదేనేమో! పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంది.

– సీహెచ్ సునీత, నీట్ రాసిన విద్యార్థిని తల్లి



విరమించుకోవాలి..



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించటం విద్యార్థులకు అన్యాయం చేయటమే. సీట్లను అమ్ముకునేందుకే ఈ ఆలోచన చేస్తున్నారు. నీట్‌లో ర్యాంకులు సాధించిన వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. కేటగిరీల వారీగా సీట్లు కేటాయించటం ఒక తప్పయితే ప్రస్తుతం ప్రైవేటీకరించాలని ఆలోచన చేయటం విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేయటమే. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి. పేద విద్యార్థులు కూడా వైద్య కలను సాకారం చేసుకునేందుకు అవకాశం కల్పించాలి.

– భోగాది ప్రేమిక శ్రీనాగ నిర్మల, నీట్ రాసిన విద్యార్థిని, మచిలీపట్నం

పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీలు

ఎస్పీ గంగాధరరావు



చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించినట్లు ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని మీకోసం సమావేశపు హాలు నందు శుక్రవారం కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ బదిలీలు ప్రభుత్వం నిర్దేశించిన నియమ, నిబంధనల మేరకు చేశామన్నారు. బదిలీలు కోరుకునే ఉద్యోగి తమ స్వగ్రామం, వార్డు ఉండే సచివాలయం కాకుండా ఇతర సచివాలయాన్ని కోరుకోవాలని తెలియజేయశామన్నారు. ఖాళీల వారీగా ఉన్న సచివాలయ ఆప్షన్లను ప్రదర్శించామని అందులో నచ్చిన సచివాలయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ బదిలీల్లో స్పౌజ్, దివ్యాంగుల కోటాతో పాటు ఆరోగ్యపరమైన సమస్యల ప్రతిపాదికన బదిలీలు చేపట్టామన్నారు. 135 మంది మహిళా పోలీసులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకుని ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారన్నారు. ఈ బదిలీల నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపి వారి పోస్టింగ్ ఆర్డర్ కాపీలను అందజేస్తామని చెప్పారు.

ఆక్రమణల గుర్తింపు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బుడమేరు ఆక్రమణలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్, వీఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి సర్వే నంబర్లతో సహా ఆక్రమణలకు సంబంధించి పూర్తి నివేదిక సత్వరమే సిద్ధం చేయాలని ఆదేశించారు.

పునరావృతం కాకుండా..

కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ప్రభుత్వం ఆపరేషన్ బుడమేరు ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించిన నివేదికలను రూపొందించాల్సిన అవసరముందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ డీకే బాలాజీ




రహదారి భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రోడ్డు భద్రత చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారుల్లో రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సంబంధిత శాఖల సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారుల్లో సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో కృష్ణా, బుడమేరు వరదలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో పాడైన ద్విచక్రవాహనాలను బాగు చేయించటం, డీలర్లతో మాట్లాడి స్పేర్ పార్టులు అందించేలా చూడాలన్నారు. ప్రమాదాల నివారణకు హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించటంతో పాటు హెల్మెట్ లేని వాహనదారులతో అప్పటికప్పుడే హెల్మెట్ కొనుగోలు చేసేలా చూడాలన్నారు. ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ పీడీ శ్రీధర్‌రెడ్డి, మోర్త్ అధికారి సుధీర్, జిల్లా ప్రజారవాణాధికారి వాణిశ్రీ, మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎ. శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎల్ సిద్ధిఖ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు..

జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మునిసిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 'స్వభావ్ స్వచ్ఛతా - సంస్కార్ స్వచ్ఛతా' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యాసంస్థలను భాగస్వామ్యం చేయాలన్నారు. అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి సఫాయీ మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఉపయోగకరమైన వస్తువులను తయారుచేయటం, పర్యావరణ అనుకూలమైన వస్తువుల తయారీపై పాఠశాల విద్యార్థులకు నిష్ణాతుల చేత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులను గాంధీ జయంతి రోజున ప్రదర్శించి, బాగున్న వాటికి నగదు బహుమతులు అందజేయాలన్నారు. జెడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్, డీపీవో నాగేశ్వరనాయక్, డీఈవో తాహెరాసుల్తానా, డీఎం అండ్‌హెచ్‌వో గీతాబాయి, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ధననాథుడు



గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని వాసవీ మార్కెట్‌లో కొలువుదీరిన గణనాథుడిని రూ. 2.70 కోట్ల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. కరెన్సీనోట్ల అలంకారంలో దర్శనమిచ్చిన 'ధన'నాథుడిని భక్తులు దర్శించి, తరించారు.

– నందిగామ టౌన్

కలెక్టర్‌కు.. అద్దె కారా?



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్‌కు అద్దె కారు ఏర్పాటు చేయటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం కలెక్టర్‌కు మూడు ప్రభుత్వ వాహనాలు ఉన్నప్పటికీ అద్దె కారు వినియోగించటంతో పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ప్రతిరోజు కలెక్టర్ వినియోగించే వాహనం మరమ్మతులు చేపట్టాల్సి వస్తే స్పేర్ కార్లుగా ఉన్న రెండు వాహనాల్లో ఒక వాహనాన్ని సాధారణంగా వినియోగిస్తారు. అయితే ఆ రెండు వాహనాలు కాకుండా రోజుకు రూ. 3వేల నుంచి రూ. 4 వేలు అద్దె చెల్లిస్తూ ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయటం ఏమిటని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న తులసీ సీడ్స్ అధినేత రామచంద్రప్రభు



వంశీధర దాసకు చెక్కు అందజేస్తున్న దోనేపూడి కిరణ్ దంపతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి తులసీ సీడ్స్ రూ. కోటి విరాళం అందజేసింది. శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో తులసీ సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు, మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగేష్ సీఎం చంద్రబాబును కలిసి విరాళం చెక్కును అందజేశారు. తులసీ గ్రూప్ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం రూ. 5.43 లక్షలు, ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య తమ వంతు సహాయంగా రూ. 2 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. గతంలో 2009లో కర్నూలు వరద బాధితుల సహాయార్థం రూ.50 లక్షల విరాళాన్ని తులసి సీడ్స్ అందజేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

చానల్ స్టాఫ్ కంపెనీ రూ.12 లక్షలు..

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ, గుంటూరుల్లోని వరద బాధితులకు చానల్ స్టాఫ్ కంపెనీ రూ.12 లక్షలు సాయం అందించింది. ఈ మేరకు వరద బాధితులకు విశేషమైన సేవలు అందిస్తున్న హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ట్రస్టుకు ఆ మొత్తాన్ని చెక్కురూపంలో శుక్రవారం అందజేసింది. అందులో భాగంగా చానల్ స్టాఫ్ కంపెనీ ఎండీ దోనేపూడి కిరణ్ దంపతులు హరేకృష్ణ ఫౌండేషన్ రీజనల్ ప్రెసిడెంట్ వంశీధర దాసకు చెక్కును అందజేశారు.

ఆయుధాగారంలో తనిఖీలు



గన్ పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆయుధాగారాన్ని శుక్రవారం ఎస్పీ ఆర్. గంగాధరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుధాగారంలో ఉన్న ఆయుధాల పనితీరును స్వయంగా ఆయన పరిశీలించారు. ఆర్మోరర్ వర్క్‌షాపు, యాంటీ రోయిట్ సామగ్రి, మందుగుండు సామగ్రి రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆయుధాలను ప్రతివారం సఫాయీ నిర్వహించాలన్నారు. ఎస్ఐ, పై స్థాయి అధికారులు వార్షిక ఫైరింగ్ నిర్వహించాలని, ఆయుధాగారం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బంది అందరికీ సరిపోయేలా స్టోన్‌గార్డ్స్, హెల్మెట్లు, లాఠీలు సమకూర్చాలన్నారు. ఎస్కార్ట్ డ్యూటీ, గార్డ్ డ్యూటీలు, ఇతర ఆర్మ్ డ్యూటీలు, వార్షిక ఫైరింగ్ నిర్వహించే సమయంలో ఆయుధాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, అడ్మిన్ ఆర్ఐ సతీష్, ఎంపీ ఆర్ఐ రవికిరణ్ పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బంది సేవలు అభినందనీయం

ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్



అధికారులు, సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మాదిరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద సహాయక చర్యల్లో ఫైర్ సర్వీసెస్ అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు. శుక్రవారం భవానీపురం స్వాతి థియేటర్ వద్ద అగ్నిమాపక వాహనాల ప్రదర్శన, సిబ్బందికి సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరిగింది. వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందిని అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం స్వాతి సెంటర్ నుంచి కంట్రోల్‌రూం వరకు వాహనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీ మాదిరెడ్డి ప్రతాప్ మీడియాతో మాట్లాడుతూ బుడమేరు వరద సహాయక చర్యల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీ ఫైర్ సర్వీసెస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సేవలు అందించారన్నారు. వరదల్లో చిక్కుకున్న గర్భిణులు, వృద్ధులను రక్షించడం, బాధితులకు ఆహారం, మంచినీరు అందించడంలో అగ్నిమాపక శాఖ ఉద్యోగులు విశేష సేవలు అందించారన్నారు. బురదమయంగా మారిన 75 వేల గృహాలను ఏపీ ఫైర్ సర్వీసెస్ సిబ్బంది శుభ్రం చేశారని, 13,424 మంది ప్రజలను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారన్నారు. 354 కిలో మీటర్ల మేర రోడ్లను శుభ్రం చేశారన్నారు. మందులు, వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. డైరెక్టర్లు పి. వెంకట రమణ, డి. మురళీమోహన్, అదనపు డైరెక్టర్లు టి. ఉదయ్‌కుమార్, జి. శ్రీనివాసులు, ఆర్. జ్ఞాన సుందరం, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఈ.స్వామి, ఏపీ శంకరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి


మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ గుండె పోటుతో మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో చోటు చేసుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చంద్రనాయక్ (40) సీఎం సెక్యూరిటీ వింగ్ తరుణ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. వరద నష్టంపై అధికారులతో సీఎం చంద్రబాబు సమావేశం కానున్న నేపథ్యంలో విధులు నిర్వర్తించేందుకు చంద్రానాయక్ అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో కానిస్టేబుల్‌కు అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. చుట్టు పక్కల ఉన్న వారు అది గమనించి సీపీఆర్ చేశారు. గురక ఎక్కువ కావడంతో అక్కడ విధుల్లో ఉన్న సూర్యారావుపేట స్టేషన్ సీఐ తన వాహనంలో సమీపంలోని ఆంధ్ర బ్రెయిన్ అండ్ హార్ట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే కానిస్టేబుల్ చంద్రానాయక్ మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం

రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత



భవానీపురం(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో శుక్రవారం గుండెపోటుతో చనిపోయిన అనంతపురం జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చంద్ర నాయక్-3570 మృతదేహాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు ఆంధ్రా హాస్పటల్‌కు వెళ్లి సందర్శించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బును వెంటనే ఆయన కుటుంబానికి అందేలా చూస్తామని మంత్రి అనిత తెలిపారు. మృతుడి కుటుంబానికి పోలీస్ శాఖ, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. చంద్రనాయక్ మృతికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది.

16న ఉత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన


సమీక్ష సమావేశంలో కలెక్టర్, సీపీ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై 16న క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సృజన, సీపీ ఎస్‌వీ రాజశేఖర్ బాబు, జాయింట్ కలెక్టర్ నిధి మీనాన్, సబ్ కలెక్టర్ భవానీశంకర్, దుర్గగుడి ఈవో కెఎస్.రామరావుతో పాటు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు. ఉత్సవాల్లో అమ్మవారికి జరిగే విశేష అలంకారాలు, దర్శన వేళలు, ప్రసాదాలు, తల నీలాలు సమర్పించే కొంటర్లతో పాటు సెక్యూరిటీ, శానిటేషన్ వంటి అంశాలను కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాది భక్తుల రద్దీ, వీఐపీలు, వీఐపీల వాహనాల అంశంపై చర్చించారు. దసరా ఉత్సవాలకు గత ఏడాది చేసిన విధంగానే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. దీనిపై కలెక్టర్ సృజన మాట్లాడుతూ 16వ తేదీ సోమవారం ఉత్సవ ఏర్పాట్లపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని చెప్పారు. ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించుకుందామని, గత ఏడాది ఎదురైన ఇబ్బందులను చర్చించి, ఈ ఏడాది అటువంటివి లేకుండా చూసుకోవాలని కోరారు. సుమారు రెండు గంటల పాటు సాగిన సమావేశంలో ఉత్సవాల గురించి పలు అంశాలపై ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. లాఅండ్ ఆర్డర్ డీసీపీ గౌతమ్ శాలి, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ జి.రామకృష్ణ, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఆలయ డీఈవో లీలా కుమార్, ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవిలతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, అగ్నిమాపక, ఎలక్ట్రిసిటీ, డీఎంహెచ్‌వో, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

గండ్లు పూడ్చినా లీకేజీ!


గండ్లు పూడ్చిన మట్టికట్ట కింద నుంచి లీకవుతున్న వరద నీరు


బుడమేరు కట్ట నుంచి వరదనీరు లీకవకుండా కప్పిన ప్లాస్టిక్ పట్టాలు, ఇసుక మూటలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాంతి నగర్ సమీపంలో అధిక వర్షాలతో తెగిన బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. పూడ్చిన గండ్లు ప్రాంతంలోని మట్టి కట్టలను జియో ఫ్యాబ్రిక్స్, ప్లాస్టిక్ కవర్లతో కప్పే పనులు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. కవర్లు కప్పి ఇసుక, డస్ట్ బస్తాలు ఉంచినప్పటికీ మట్టి కట్ట కింద నుంచి నీరు లీకేజీ అవుతుంది. లీకైన నీరంతా సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి చేరుతుంది. దీంతో పాటు పూర్వం కట్ట పోసే సమయంలో పోసిన మట్టితో పాటు కాలువ పటిష్టతకు పేర్చిన క్వారీ రాళ్లు వ్యవసాయ పొలాల్లో మేటలు వేశాయి. కనుచూపు మేరలో పొలాలు రాళ్ల గుట్టలతో నిండి ఉన్నాయి. సంబంధిత రైతులు మరలా వ్యవసాయం చేసుకోవాలంటే మట్టి కుప్పలతో పాటు రాళ్లను సైతం ఏరివేయాలంటే భరించరాని ఖర్చు అవుతుంది. పొలాల్లో పేరుకు పోయిన మట్టి, రాళ్లను ప్రభుత్వ ఖర్చుతోనే తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సబ్సిడీతో సౌర విద్యుత్ వినియోగించుకోండి

కలెక్టర్ డీకే బాలాజీ


విద్యుత్ అధికారులతో కలిసి టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం):విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల ఖర్చులను తగ్గించుకునేందుకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన వినియోగించుకుని లబ్ధి పొందాలని కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ నుంచి విద్యుత్‌శాఖాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఈ పథకంపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ఇంటి పైన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ అమర్చుకోవచ్చునని చెప్పారు. దీనిద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. గృహ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన సోలార్ విద్యుత్‌ను ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్)కు అందిస్తే ప్రతి యూనిట్‌కు రూ. 2.90 చెల్లిస్తుందన్నారు. ఈ పథకం కోసం జూనియర్ లైన్‌మెన్ లేదా ఎనర్జీ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. దీనికి ప్రత్యేకంగా డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణను నోడల్ అధికారిగా నియమించారని తెలిపారు. ఎలాంటి సమాచారం కావాలన్నా 9440812104 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఈ పథకం 1 నుంచి 2 కిలోవాట్లు, 2 నుంచి 3 కిలోవాట్లు కెపాసిటీల్లో సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. వీటికి రూ. 30 నుంచి రూ. 78 వేల వరకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందవచ్చని వెల్లడించారు. ఈ సౌర విద్యుత్‌శక్తిని పెంపొందించుకుని పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. డీఆర్వో కె చంద్రశేఖరరావు, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. భాస్కరరావు పాల్గొన్నారు.

కృష్ణానదిలో మృతదేహం లభ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కనకదుర్గ వారధి సమీపంలో కృష్ణానదిలో నీటిలో ఒక మృతదేహం తేలుతున్నట్లు శుక్రవారం సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మగ వ్యక్తిగా నిర్ధారించారు. ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని, వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. మృతుడు ఐదడుగుల ఎత్తు కలిగి ఉండి లైట్ బిస్కట్ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, కట్ డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లంక భూములకు ఈ క్రాప్ నమోదు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్

అవనిగడ్డ: లంక భూములకు ఈ క్రాప్ నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. చల్లపల్లి మండల పరిధిలోని వెలివోలు శివారు చీడేపూడి లంకలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వరదల వల్ల లంకభూముల రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. చీడేపూడిలంకలో 137 మంది రైతులకు అసైన్డ్ జరగలేదన్నారు. లంకభూములు అసైన్డ్ భూములు కావడం వల్ల ఈ క్రాప్ లేదని, ఈ క్రాప్ లేనివారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందడం లేదని తహసీల్దార్ వనజాక్షి దృష్టికి తీసుకురాగా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు, అట్లూరి వెంకటేశ్వరరావు, మాలెంపాలెం కాంచనరావు, పెనుమత్స ప్రభాకరరావు, రాజారత్నంతో పాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నుంచి ట్రక్కు విడిపోయి వ్యక్తి మృతి


చెన్నూరు సమీపంలో పక్కకు పడిపోయిన ట్రాక్టరు ట్రక్కు, నాపరాళ్లు


శ్రీహరి మృతదేహం

పెడన:మండల పరిధిలోని చెన్నూరు గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే చనిపోగా మరో ముగ్గురు గాయపడిన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాపరాళ్ల లోడుతో ట్రాక్టర్ పెడన నుంచి చెన్నూరు గ్రామానికి వెళ్తోంది. రాళ్ల లోడుపైన కె.చంటి, కె.ఆంజనేయులు, తాపి మేస్త్రిగా పనిచేస్తున్న వద్దపల్లి శ్రీహరి (32) కూర్చున్నారు. కమలాపురం దాటిన తరువాత చెన్నూరు సమీపంలో దెబ్బతిన్న రోడ్డులో ట్రాక్టర్ నుంచి ట్రక్కు విడిపోయి పక్కకు ఒరిగి పడిపోవడంతో చంటి, ఆంజనేయులు దూరంగా దూకేశారు. శ్రీహరి మాత్రం నాపరాళ్ల కింద పడి చనిపోయాడు. శ్రీహరి శ్రీకాకుళం నుంచి వలస వచ్చి చెన్నూరు గ్రామంలో స్థిరపడినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారని తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, తల్లి ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న శ్రీహరి చనిపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం పెద్దాసుపత్రికి తరలించారు. గాయపడిన వారు కూడా చెన్నూరుకు చెందిన వారే కావడంతో చేవేంద్రపాలెం పీహెచ్‌సీలో చికిత్స తీసుకుని వెళ్లిపోయారు.

పంట బోదెలో మహిళ మృతదేహం

కూచిపూడి(మొవ్వ):కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదసనగల్లు-అయ్యంకి మార్గంలో గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. రైసు మిల్లు సమీపంలో 40 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతదేహం పంట బోదెలో తేలుతూ ఉండటాన్ని గ్రామస్తులు గురువారం రాత్రి గుర్తించారని చెప్పారు. ఆ గ్రామ వీఆర్‌వో మరీదు ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతురాలిని ఎవరైనా గుర్తిస్తే 9440796473 నంబర్లో సమాచారం ఇవ్వాలని కోరారు.